

గురుకుల పాఠశాల విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సింగూరు గురుకులంలో

విద్యార్థులకు అస్వస్థత

వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్యాధికారులు 7


128 కేజీల గంజాయి స్వాధీనం

గంజాయి విలువ రూ.64 లక్షలు

నలుగురి అరెస్టు, రెండు కార్లు స్వాధీనం 7



ప్రాజెక్టులకు జలకళ



జోగిపేట రూరల్: అలుగు పారుతున్న అన్నసాగర్ చెరువు

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో ప్రాజెక్టులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. ఆదివారం సాయంత్రానికి 28,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 43,634 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదైంది. ఘనపురం ఆనకట్ట అలుగు పారుతున్నది. ఏడుపాయల ఆలయం జలదిగ్బంధంలోనే ఉంది. వరద ఉధృతి దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

- భారీ వరదలతో జలకళ సంతరించుకున్న నదులు, ప్రాజెక్టులు
- మంజీర పరవళ్లు..
- 'సింగూరు'కు పోటెత్తిన వరద
- ఇన్‌ఫ్లో 28,357 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 43,634 క్యూసెక్కులు
- ఐదు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- అలుగు పారుతున్న వనదుర్గా ప్రాజెక్టు
- నాలుగో రోజు జలదిగ్బంధంలోనే ఏడుపాయల ఆలయం
- మత్తడి దుంకుతున్న చెరువులు, కుంటలు

పుల్‌కల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. నాలుగైదు రోజులుగా ఎగువ నుంచి వరద ప్రవాహం పెద్ద ఎత్తున వస్తున్నది. ఐదు గేట్లను ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టులోకి 28,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 43,634 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నారు. దిగువన కలబ్‌గూర్ మంజీర జలాశయం నాలుగు క్రస్ట్‌గేట్లతో పాటు రెండు స్కవర్ గేట్లను ఎత్తి దిగువన వదులుతున్నారు. మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు నది తీర ప్రాంతానికి వెళ్లవద్దని పుల్కల్, చౌటకూర్ తహసీల్దార్లు కృష్ణ, అనుదీప్ సూచించారు.

పొంగిపొర్లుతున్న ఘనపూర్ ఆనకట్ట

పాపన్నపేట/కొల్చారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొల్చారం వద్ద మంజీర ఉగ్రరూపంతో ప్రవహిస్తున్నది. ఘనపూర్ ఆనకట్ట పై నుంచి పరవళ్లు తొక్కుతున్నది. ఏడుపాయల దుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలోనే ఉంది. సింగూర్ నుంచి నీటిని విడుదల చేయడంతో పాటుగా స్థానికంగా కురిసిన వర్షానికి భారీగా వరద వస్తున్నది. ఘనపూర్ అలుగు దుంకిన నీరు నిజాంసాగర్ వైపు వెళ్తున్నది. వనదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురం వద్ద ఉంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం, వరుస సెలవులు రావడంతో మంజీర ప్రవాహాన్ని చూడటానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రాజగోపురంలోని దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదుట ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీర నీరు, పొంగిపొర్లుతున్న ఘనపురం ప్రాజెక్టును చూసి జలకళను ఆస్వాదిస్తూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాటు చేశారు. భక్తులు నీటి వైపు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది నిరంతరాయం అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు.

నిండుకుండలా నల్లవాగు ప్రాజెక్టు

కల్హేర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం తీ౩౦ శిధి అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి తీ౩౦శిశా అడుగులకు చేరుకున్నట్లు నీటి పారుదల శాఖ డిఈఈ పవన్‌కుమార్, ఏఈ శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎగువ నుంచి ఆదివారం వీతీశి క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నట్లు వారు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి ఇలాగే వరద ఇన్‌ఫ్లోగా వస్తే సోమవారం వరకు ప్రాజెక్టు అలుగుపై నుంచి పొంగిపొర్లే అవకాశం ఉందని డిఈఈ, ఏఈ తెలిపారు.

మత్తడి దూకుతున్న చెరువులు

జోగిపేటరూరల్/రేగోడు/తూప్రాన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అందోల్ మండల పరిధిలోని అన్నసాగర్ చెరువు రెండు వైపుల అలుగు పారుతున్నది. హైవేపై వెళ్లే ప్రయాణికులు చెరువు వద్ద ఆగి అలుగును చూస్తూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. అన్నసాగర్ చెరువును డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి పరిశీలించారు.

●రేగోడు మండలం జగిర్యాల-కొండాపూర్ చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. మర్పల్లి మంబోజి చెరువు, రేగోడు ఊరకుంటకు గండి పడటంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పూడ్చారు. తిమ్మపూర్ చెరువు అలుగు ప్రవాహం ఉధృతికి రేగోడు వచ్చే రోడ్డు కొట్టుకుపోయింది.

●తూప్రాన్ పట్టణంలో ఆదివారం సాయంత్రం గంటపాటు కురిసిన ఈ వర్షానికి ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. రోడ్డుపై నీరు నిలవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది.

కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యటన

మెదక్ అర్బన్/టేక్మాల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను ఆదివారం ఆయన పరిశీలించారు. ఫిర్యాదుల రిజిస్టర్‌ను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు అందించారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తగిన వెంటనే సహాయం అందించాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన టేక్మాల్ మండలంలో పర్యటించి పెద్దచెరువు అలుగు, గుండువాగు, టేక్మాల్-దనూరా రోడ్డుపై వరద ప్రవాహాన్ని పరిశీలించారు.



నిండుకుండను తలపిస్తున్న నల్లవాగు ప్రాజెక్టు



తూప్రాన్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



టేక్మాల్‌లో గుండువాగును పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లా అక్షరాస్యత 64.08 శాతం

ఫేస్‌టు ఫేస్



కె.వెంకట్‌రెడ్డి, వయోజన విద్యాశాఖ డీడీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరినీ సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వయోజన విద్యాశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. నవ భారత్ సాక్షరతా కార్యక్రమంలో (ఎన్ఐఎల్‌పీ) భాగంగా ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమ అమలుకు వయోజన విద్యా శాఖ శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశం, లక్ష్యం ఏమిటి?

ప్రాథమిక అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు, నిరంతర విద్య అందించడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశ్యాలు. పాఠశాల విద్యావకాశం పొందని పదిహేనేళ్ల పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'ఉల్లాస్' లక్ష్యం.

సంగారెడ్డి జిల్లాలో అక్షరాస్యత శాతం ఎంత?

అవగాహనతో చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడమే అక్షరాస్యత. 2011 లెక్కల ప్రకారం సంగారెడ్డి జిల్లా అక్షరాస్యత 64.08 శాతంగా ఉన్నది.

'ఉల్లాస్' కార్యాచరణ ఏమిటీ ?

జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించాం. వారికి చదువు చెప్పేందుకు వలంటీర్లను కూడా ఎంపిక చేశాం. చదువు అసలే రాని వారితో పాటు మధ్యలో బడి మానేసిన వారికి చదువు ఆవశ్యకతను తెలియజేసి చదువుకునేలా చేస్తాం. ఇందుకోసం ఇప్పటికే జిల్లాస్థాయిలో మూడు శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాం. ఇటీవలే జిల్లా స్థాయిలో శిక్షణ పూర్తి చేశాం. ప్రతీ మండలం నుంచి ఇద్దరు రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇచ్చాం. వీరు త్వరలోనే ప్రతీ పంచాయతీ పరిధిలో ఉన్న ఒక ఉపాధ్యాయుడు, ఒక వీవోఏకు శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన వారు స్థానికంగా ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ ఇస్తారు. అనంతరం గుర్తించిన నిరక్షరాస్యులకు వలంటీర్లు చదువు చెప్పి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు.

జిల్లాలో ఎంత మంది నిరక్షరాస్యులు, వలంటీర్లను గుర్తించారు?

సంగారెడ్డి జిల్లాలో 55,371 మంది నిరక్షరాస్యులు, బోధించేందుకు 5,537 మంది వలంటీర్లను గుర్తించాం. ఒక వలంటీర్ పది మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారుచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించాం. ఇప్పటికే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అక్షర వికాసం పుస్తకాలు, మార్గదర్శిని, బ్రోచర్లు జిల్లాకు చేరుకున్నాయి. అందరికి విద్యనందించడం మనందరి బాధ్యత, అక్షర ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొని జిల్లాలో అక్షరాస్యత శాతం పెంపునకు ప్రతీ ఒక్కరూ కృషి చేద్దాం.

ప్రచారం ఘనం.. ఫలితం శూన్యం

- మొక్కుబడిగా మున్సిపాలిటీల్లో వంద రోజుల కార్యక్రమం
- డ్రైనేజీల్లో పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలు
- ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు
- విజృంభిస్తున్న దోమలు.. పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో 14 డెంగ్యూ కేసులు నమోదు



నర్సాపూర్‌లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీ

మెదక్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మున్సిపాలిటీల్లో వంద రోజుల కార్యక్రమం అపహాస్యం పాలవుతున్నది. ఎంతో అట్టహాసంగా ఎమ్మెల్యేలు, అధికారులు, కమిషనర్లు ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి ప్రారంభించారు. శుభ్రతా డ్రైవ్‌లు, మొక్కలు నాటడం, సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. పత్రికలు, సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేశారు. వంద రోజుల్లో పట్టణాల రూపురేఖలు మార్చేస్తామంటూ హామీలు గుప్పించారు. కానీ, ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు.

చెత్త కుప్పలుగా ఖాళీ స్థలాలు

మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీల్లోని పలు వార్డుల్లోని ప్లాట్లు, ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిపోయాయి. దోమలకు అడ్డాగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత యజమానులదే. కానీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కూడా లేకపోవడంతో ఓపెన్ ప్లాట్ల యజమానులు పట్టించుకోవడమే లేదు. పారిశుధ్య సిబ్బంది ఎక్కడికక్కడ ఫొటో సెషన్లకే పరిమితమైపోతూ.. అసలు సమస్యలు మాత్రం అలాగే వదిలేస్తున్నారు. ప్రజలు పరిసరాల్లోనే చెత్తాచెదారం వేస్తున్నారు. ఖాళీ ప్రదేశాల్లోకి నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది నివాసాల్లోకి ప్రవేశిస్తున్నాయని, క్రిమి, కీటకాలు, పాములు సంచరిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

అమలు కాని ప్రణాళిక

మున్సిపాలిటీల పరిధిలో వంద రోజుల ప్రణాళిక అమలు కావడం లేదు. వీటి కింద చేపట్టాల్సిన వివిధ పనులు చేయడంపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పలు కాలనీలు, శివారు గ్రామాల్లో మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడంతో కంపుకొడుతున్నాయి. మెదక్ జిల్లా కేంద్రంలోని బస్ డిపో చుట్టుపక్కల డ్రైనేజీలు దుర్వాసన వెలువరిస్తున్నాయి. రద్దీగా ఉండే ప్రాంతంలో పలు హోటళ్లు ఉండడంతో ప్రజలు ముక్కుమూసుకుని తినాల్సి వస్తోందని వాపోతున్నారు. మున్సిపల్ చట్టాల ప్రకారం ప్లాట్ల యజమానులు తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోకపోతే మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలి. కానీ, ఇప్పటివరకూ ఒక్కరికి కూడా నోటీసు ఇవ్వలేదని సమాచారం. దీంతో, స్థలాల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

జిల్లాలో 14 డెంగ్యూ కేసులు నమోదు

వ్యాధుల సీజన్ కొనసాగుతుండడంతో అధికారులు తక్షణమే స్పందించి ఖాళీ ప్రదేశాలలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 14 డెంగ్యూ కేసులు నమోదు అయినట్లు జిల్లా వైద్యాధికార కార్యాలయం సిబ్బంది తెలిపారు. దోమల వ్యాప్తి కారణంగా డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

నకిలీ సర్వీస్ బుక్కు, ఫోర్జరీ సంతకాలతో

మిషన్ భగీరథలో ఉద్యోగం!

ఫిర్యాదుతో మెమో జారీ చేసిన అధికారులు

కల్హేర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): లంచాలకు ఆశ పడిన అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో ఉద్యోగం పొందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని మార్డి గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో డొంక కదిలింది. మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన బొమ్మల బాల్‌రాజ్ అనే వ్యక్తి ఓటాబంధి పద్ధతిపై వీఆర్ఏగా విధులు నిర్వహించే వాడు. వీరు ఎనిమిది మంది భాగస్వాములు. కాగా, గత ప్రభుత్వ హయాంలో అర్హత కలిగిన వీఆర్ఏలను రెవెన్యూ శాఖ నుంచి ఇతర శాఖలకు సర్దుబాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు. ఇదే అదనుగా భావించి ఎలాంటి అర్హత పత్రాలు లేకున్నా 2023 సంవత్సరంలో అప్పటి కల్హేర్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన అధికారి బాల్‌రాజ్ పేరిట వీఆర్ఏగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎనిమిది మంది భాగస్వాములను సంప్రదించకుండా బాల్‌రాజ్‌ను వీఆర్ఏగా గుర్తించి ఇతర శాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని వీఆర్ఏ ఓటాబంధి భాగస్వాముల తరఫున బొమ్మల అంజయ్య సంగారెడ్డి కలెక్టర్, మిషన్ భగీరథ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నకిలీ సర్వీస్ బుక్కు, తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేశారని, ఉమ్మడి మెదక్ జిల్లా అని ఉన్న నకిలీ స్టాంపులను వినియోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం నారాయణఖేడ్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో హెల్పర్‌గా కొనసాగుతున్న బాల్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మిషన్ భగీరథ డీఈఈ ఫణివర్మ బొమ్మల బాల్‌రాజ్‌కు మెమో జారీ చేశారు. ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆరోపణల అనంతరం చర్యలు తీసుకుంటారని సమాచారం.

అధిక ధరలకు కొబ్బరికాయలు

మలన్న సన్నిధిలో రూ. 60 వసూలు

వారానికో ధర, ఇష్టారీతిన విక్రయాలు 7

రెండో అంతస్తు నుంచి

కింద పడి బాలుడి దుర్మరణం



హర్షవర్ధన్

అమీన్‌పూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భవనం రెండో అంతస్తులో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడి నాలుగు సంవత్సరాల బాలుడు దుర్మరణం పాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటేల్‌గూడా హరివిల్లు టౌన్‌షిప్‌లో నివసించే గురుమూర్తి కుమారుడు హర్షవర్ధన్(4) ఆదివారం మధ్యాహ్నం భవనం రెండో అంతుస్తులో ఆడుకుంటున్నాడు. ఇంతలోనే రెయిలింగ్ సందులో నుంచి బాలుడు కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. తండ్రి గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రబడిన

ఆకాశం

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో రోజూ కురుస్తున్న వర్షాలకు మబ్బులతో కూడుకున్న ఆకాశం ఆదివారం ఒక్కసారిగా ఎర్రబడింది. ఈ సుందర దృశ్యం చూపరులను ఆకట్టుకున్నది.

-ఫొటో: సంగారెడ్డి జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


కార్తిక్(ఫైల్)

చేగుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి వడ్డెర కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. కాలనీవాసులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఉప్పు కార్తిక్ (22) ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డిని సంప్రదించగా దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని వెల్లడించారు. కార్తిక్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పేకాటరాయుళ్ల అరెస్టు

● నగదు, ద్విచక్రవాహనాలు స్వాధీనం


జహీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలం హోతి(బి) గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 8 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, నిందితుల నుంచి రూ.53,350, 8 మొబైల్ ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై సుమోటో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. మట్కా, పేకాట, ఇతర జూదాలు ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మెదక్ అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కోసం ఈనెల 19న ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మెదక్ స్టేడియంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికలకు రన్స్ త్రో జంప్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 31న మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963005540 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మేకను కాపాడేందుకు బావిలో దూకిన కాపరి

● తీరా ఈత రాకపోవడంతో కేకలు
● కాపాడిన స్థానికులు


రామచంద్రాన్ని పైకి లాగుతున్న దృశ్యం

చేర్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ శివారులోని కర్షక్‌నగర్ కాలనీలో ఆదివారం బావిలో దూకిన ఓ వ్యక్తిని స్థానికులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్లపల్లి కాలనీకి చెందిన రామచంద్రం మేకలు కాస్తుండగా, ఓ మేక బావిలో పడిపోయింది. దానిని కాపాడటానికి రామచంద్రం బావిలోకి దూకాడు. తీరా అతడికి ఈత రాకపోవడంతో ప్రాణభయంతో కేకలు వేశాడు. ఆ దారిన వెళ్తున్న కాంగ్రెస్ నాయకుడు నాగరాజు అరుపులు విని అక్కడి వెళ్లి చూడగా రామచంద్రం కనిపించాడు. దీంతో స్థానికుల సహాయంతో బయటకు లాగారు. నాగరాజును స్థానికులు స్థానికులు అభినందించారు.

క్రైం కార్నర్

128 కేజీల ఎండు గంజాయి పట్టివేత

- గంజాయి విలువ రూ.64 లక్షలు
- నలుగురి అరెస్టు, రెండు కార్లు స్వాధీనం

పటాన్‌చెరు ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న 128 కేజీల ఎండు గంజాయిని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ జయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం గజపతి జిల్లా నుంచి ఫిరోజ్ అహ్మద్, సగర్‌నాయక్, మహ్మద్ అబ్దుల్, ఇర్ఫాన్ మహ్మద్ మహారాష్ట్ర మాలేగామ్‌కు రెండు కార్లలో 128 కేజీల ఎండు గంజాయిని రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా నార్కోటిక్ ఎనాలసిస్ (ఎస్ఎన్‌బీ) విభాగం నిఘా పెట్టి తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి కూడలిలో వారిని పట్టుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు కార్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 64 లక్షల వరకు ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన బైక్ రైడింగ్ మోజు

నర్సాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బైక్ రైడింగ్ మోజు ఒక యువకుడి ప్రాణాలను బలిగొన్న ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో జరిగింది. ఆదివారం నర్సాపూర్ ఎస్ఐ లింగం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి అనిల్‌కుమార్ కుమారుడు శశాంక్‌నాథ్(27) ఆదివారం ఉదయం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై, అతడి స్నేహితుడు ఆదిత్య మరో బైక్‌పై మెదక్ సమీపంలోని పోచారం డ్యాం వరకు రైడింగ్‌కు వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో శశాంక్‌నాథ్ బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీ కొని తీవ్ర గాయాలతో పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు శశాంక్‌నాథ్‌ను నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఇది తెలియని ఆదిత్య వెనుకాల వస్తున్నాడని అనుకుని ఇంటికి చేరుకున్నాడు. శశాంక్ ఎంతకి ఇంటికి రాకపోవడంతో నర్సాపూర్ పోలీసులను సంప్రదించగా రోడ్డు ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. శశాంక్ నాథ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు..


విఠల్ మృతదేహం


ప్రమాదానికి కారణమైన కారు


నుజ్జునుజ్జైన ద్విచక్రవాహనం

దుబ్బాక, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) :కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన మంతూరి విఠల్(60), అతడి కుమారుడు చంద్రశేఖర్(35) ఆదివారం రాత్రి సిద్దిపేట వైపు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వెళ్తున్నారు. దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామశివారులోకి రాగానే సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టడంతో తండ్రికొడుకులిద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా తండ్రి విఠల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన పూర్తిగా వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- నలుగురికి గాయాలు


నుజ్జునుజ్జైన కారు

అల్లాదుర్గం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం మండలం చిల్వర్ సమీపంలోని 162వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన స్వరాజ్యలక్ష్మి, గంగాధర్ల కుమార్తె శ్రీహర్షను సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూలో చేర్పించడానికి తండ్రి శంకర్‌తో కలిసి కారులో వెళ్తున్నారు. ఐబీ సమీపంలో రోడ్డుపై ఒక చెడిపోయిన లారీని టైర్ తొలగించి పక్కన ఉంచారు. వీరి కారు ముందుగా ఆ టైర్‌ను ఢీకొని అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వరాజ్యలక్ష్మి, గంగాధర్‌లకు స్వల్ప గాయాలు కాగా, శ్రీహర్ష, శంకర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కంగ్టి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాంతీర్థ్ శివారులో ఈ నెల 14న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ దుర్గారెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తుర్కవడగాం గ్రామానికి చెందిన నర్సమ్మ(35) భర్త 15 ఏళ్ల క్రితం మరణించాడు. ఒంటరిగా ఉంటున్న నర్సమ్మతో రాంతీర్థ్ గ్రామానికి చెందిన మేత్రిరాజు(40)తో ఏడాదిగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనను పెళ్లి చేసుకోవాలని నర్సమ్మ రాజును తరచుగా కోరడంతో నిరాకరించాడు. ఈ నెల 14న రాంతీర్థ్ శివారులో ఉన్న రేకుల షెడ్డులో ఇద్దరూ మాట్లాడుకుంటుండగా పెళ్లి విషయమై గొడవ జరిగింది. దీంతో రాజు నర్సమ్మ ఎలాగైన వదిలించుకోవాలన్న ఉద్దేశంతో ఆమె తలపై, ఛాతీపై రాయితో బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హిట్ అండ్ రన్ బాధితులకు ఆర్థిక సహాయం

- మృతిచెందినవారికి రూ.2లక్షలు
- గాయపడినవారికి రూ.50 వేలు

తెలుసుకుందాం



సిద్దిపేట క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్న తరుణంలో, ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసులలో బాధితులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. మోటార్ వెహికల్స్ యాక్ట్-1988లోని సెక్షన్ 161 కింద రూపొందించబడిన ఈ కొత్త పథకం 2022 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఇది అంతకుముందు ఉన్న 1989 సోలాటియం స్కీమ్‌ను రద్దు చేసి, బాధితులకు మరింత ఎక్కువ ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పథకం ప్రకారం, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.2లక్షల పరిహారం లభిస్తుంది. అదే విధంగా, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు సహాయం అందజేయబడుతుంది. ఇది పాత పథకంలో ఉన్న మొత్తాల కంటే చాలా ఎక్కువ. ఈ పథకం ద్వారా, వాహనం వివరాలు తెలియని ప్రమాదాల్లో ఆర్థికంగా నష్టపోతున్న బాధితులకు కొంత ఊరట లభిస్తుంది.

దరఖాస్తు విధానం..

బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు ఈ సహాయం కోసం ప్రమాదం జరిగిన 6 నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తును ఫారం-1 ద్వారా సంబంధిత రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌కు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు, పోలీస్ ఎఫ్ఐఆర్, మరణం సంభవిస్తే పోస్టుమార్టం సర్టిఫికేట్, లేదా గాయాలైతే ఇంజురీ సర్టిఫికేట్ వంటి ముఖ్యమైన పత్రాలను జతచేయాలి. దరఖాస్తు అందిన తరువాత, విచారణ జరిపి, ఫారం-2 ద్వారా ఒక నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. జిల్లా కలెక్టర్, నివేదికను పరిశీలించి, ఫారం-3 ద్వారా పరిహారాన్ని ఆమోదిస్తారు. ఆ తర్వాత, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధితుల బ్యాంక్ ఖాతాలో డబ్బును నేరుగా జమ చేస్తుంది. ఈ మొత్తం ప్రక్రియ 6 నెలల లోపు పూర్తి కావాలని ప్రభుత్వం నిర్దేశించింది.

పర్యవేక్షణ, పోలీసుల పాత్ర

పథకం అమలును జిల్లా స్థాయిలో ఒక మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఇందులో డ్రిస్టిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సభ్యులుగా ఉంటారు. కేంద్ర స్థాయిలో కూడా ఈ పథకం కోసం ఒక స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయబడింది. ప్రమాదం జరిగినప్పుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి బాధితులకు ఈ పథకం గురించి సమాచారం అందిస్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ఈ సహాయం ఎలా పొందాలో వివరిస్తారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ మాట్లాడుతూ, బాధితులు ఈ పథకాన్ని తప్పకుండా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ పథకం గురించి మరిన్ని వివరాల కోసం సమీపంలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేదా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చు.

డ్రాగన్‌ఫ్రూట్.. పోషకాలు పుష్కలం

- రూ. 100కు కిలో చొప్పున విక్రయం



మెదక్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలతో నిండిన డ్రాగన్‌ఫ్రూట్‌ను వ్యాపారులు మొబైల్ వ్యాన్‌లలో తిరుగుతూ జిల్లా అంతటా విక్రయిస్తున్నారు. జహీరాబాద్‌లోని తోటల్లో స్థానిక రైతులు పండించిన ఈ పండును కిలో రూ.100కే అమ్ముతున్నారు. ఒక్క పండు 80 ధర పలికిన రోజులు ఉన్నాయని, ఇప్పుడు అదే ధరకు ఐదారు పండ్లు లభిస్తుండటంతో ప్రజలు ఎగబడి కొంటున్నారు. తమ లాభాలు తగ్గించుకుని ఎక్కువ అమ్మకాలు చేస్తున్నామని జహీరాబాద్‌కు చెందిన వ్యాపారి ఉస్మాన్ ఖాన్ తెలిపారు. డ్రాగన్‌ఫ్రూట్‌లో విటమిన్ సి, ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు జీర్ణ వ్యవస్థకు, చర్మకాంతికి, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు.

మనువాదం, మతోన్మాదంపై పోరు

- జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి


జోగిపేట సభలో ప్రసంగిస్తున్న రమణ మూర్తి

జోగిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు దేశంలో మతోన్మాదం, మనువాదం పెరిగిపోతుందని జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణ మూర్తి వాపోయారు. ఆదివారం జోగిపేటలోని జోగినాథ గంజ్ ఆవరణలో నిర్వహించిన "జైభారత్ సామాజిక విప్లవ రణభేరి" సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మతం పేరిట దేశం చీలకుండా చివరి వరకు పోరాటం చేసిన ఏకైక వ్యక్తి గాంధీజీ అన్నారు. అదే సమయంలో ఆయన కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఇక కుల వివక్షను ఎదుర్కొని, దానిపై పోరాడిన వ్యక్తి అంబేడ్కర్ అని గుర్తుచేశారు.. అయితే అంబేడ్కరిస్టులుగా చెప్పుకునే పలువురు మేధావులు గాంధీని కులవాదిగా ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. గాంధీ, అంబేడ్కర్‌పై సమాజంలో నెలకొన్న అబద్ధాల చీకటిని బద్దలు కొట్టి వాస్తవాలను ప్రజలకు చూపడానికి జైభారత్ ఉద్యమం చేస్తోందన్నారు. సాహసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముప్పారం ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి రజని, రణభేరి రాష్ట్ర రీఆర్గనైజింగ్ కమిటీ కోకన్వీనర్ జీవన్ జోయెల్, జిల్లా నాయకులు అందోల్ మల్లేశం, పోలె నరేందర్, ముప్పారం పద్మారావు, తంపులూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..


గుంతలమయంగా మిర్జాపల్లి, శేరిపల్లి రోడ్డు

చిన్నశంకరంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి, నార్సింగి మండలం శేరిపల్లి మధ్య ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో చినుకుపడితే చిత్తడిగా మారిపోతోంది. దారి పొడవునా గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసినా మరమ్మతులు నోచుకోవడం లేదు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రయాణీకులకు ఇబ్బందులు తీర్చాలని మిర్జాపల్లి, శేరిపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముళ్లపొదల్లో అతిథి గృహం


చిన్న ఘనపూర్ శివారులో ఉన్న అతిథి గృహం

కొల్చారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కొల్చారంలో రూ.లక్షలు వెచ్చించి అతిథి గృహ నిర్మాణం చేపడితే.. అతిథులు రాకపోవడంతో ముళ్లపొదలు పెరిగి, మందుబాబులకు అడ్డాగా మారింది. కొల్చారం మండలం చిన్నఘనపూర్ శివారులో రూ.10 లక్షలతో అతిథి భవన నిర్మాణం ఏర్పాటు చేశారు. అయితే అక్కడికి ఏ ఒక్క ప్రజాప్రతినిధి రాకపోవడంతో అందులో నీటి పారుదల శాఖ అధికారులు పెద్దఎత్తున సామగ్రి వేశారు. దీంతో భవనంలోని విలువైన ఫర్నిచర్ తుప్పుపట్టి పనికిరాకుండా పోయింది. బయట వేసిన బండలను, కిటికీలను ధ్వంసం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ల పొదల్లో ఉన్న అతిథి గృహానికి మరమ్మతులు చేయాలని స్థానికులు తెలుపుతున్నారు.

కథల పోటీలో అనంతసాగర్ విద్యార్థికి బహుమతి


విశ్వతేజ

చిన్నకోడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఉరిమళ్ల ఫౌండేషన్ నిర్వహించిన బాలల కథల పోటీలో చిన్నకోడూరు మండలం అనంతసాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి బి. విశ్వతేజ బహుమతి గెలుచుకున్నాడు. విశ్వతేజ రాసిన 'బెట్టింగ్ గేమ్' కథ బహుమతికి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి ఆదివారం తెలిపారు. ఈనెల 24న ఖమ్మంలో జరగనున్న కార్యక్రమంలో విశ్వతేజకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు అతని కథ ముద్రించిన కథా సంకలన పుస్తకాన్ని అందజేస్తారని ఆమె చెప్పారు. విద్యార్థిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు బైతి దుర్గయ్యను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఉపాధ్యాయుడు రామకృష్ణకు పద్మచక్ర జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నిజాంపూర్(కె) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పోట్రు రామకృష్ణకు పద్మచక్ర జాతీయ పురస్కారం లభించింది. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బాబుమోహన్, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత, న్యూమరాలజిస్ట్ దైవజ్ఞశర్మల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. విద్యా, పర్యావరణ రక్షణ రంగంలో చేసిన సేవలకుగాను ఈ పురస్కారం లభించిందని రామకృష్ణ తెలిపారు.

సింగూరు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- వైద్య శిబిరం ఏర్పాటు


గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్

పుల్కల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలంలోని సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గత మూడు రోజులుగా విద్యార్థులు అస్వస్థతతో ఉండటంతో పుల్కల్ పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవగా, చికిత్స అనంతరం సగం మంది కోలుకున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లేందుకు పాఠశాలకు బారులు తీరారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ ఆగమయ్య సంప్రదించగా ఆగస్టు 15న నిర్వహించిన ఆటల పోటీల్లో వర్షంలో తడవడం వల్ల వారికి వైరల్ ఫీవర్ వచ్చిందని తెలిపారు. విద్యార్థులు కోలుకునే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు.

అధిక ధరలకు కొబ్బరికాయలు

- మలన్న సన్నిధిలో రూ.60 వరకు వసూలు
- వారానికో ధర, ఇష్టారీతిన విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కొమురవెల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో అమ్ముతున్న కొబ్బరికాయల ధరలు చూసి ఆశ్చర్యపోతున్నారు. దేవాలయ నిబంధనల ప్రకారం ఒక్కో కొబ్బరికాయను రూ.30కి విక్రయించాలి. కానీ విక్రయదారులు నిబంధనలను పట్టించుకోకుండా ఒక్కో కాయను 50 నుంచి 60 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై భక్తుల నుంచి ఫిర్యాదులు అందాయని, టెండర్ దారునికి నోటీసు జారీ చేసి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించామని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. లేని పక్షంలో నిబంధనల ప్రకారం టెండర్‌ను రద్దు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆమె అన్నారు.


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయాధికారులు,అర్చకులు

మల్లన్న ఆలయంలో భక్తజన సందడి

కొమురవెల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏఈవో శ్రీనివాస్,ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి మల్లన్నను దర్శించుకున్న భక్తులకు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆలయ అధికారులు ప్రారంభించారు.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి



వర్గల్, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో 35 సత్యనారాయణ స్వామి వ్రతాలు, 10 నిజాభిషేకాలు, 9 నిత్యకల్యాణాలు జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

పార్కు చేసిన స్కూటీ చోరీ

నర్సాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ బస్టాండ్ సమీపంలోని టిఫిన్ సెంటర్ వద్ద పార్క్ చేసిన స్కూటీ చోరీకి గురైంది. నర్సాపూర్‌కు చెందిన శక్తి ఆకాష్ అనే వ్యక్తి తన స్కూటీని పార్క్ చేసి పండ్ల దుకాణానికి వెళ్లి వచ్చేసరికి అది కనిపించలేదు. చుట్టూ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా నిలిపివేత

నారాయణఖేడ్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో సోమవారం తాగు నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదివారం తెలిపారు. మనూరు మండల పరిధిలోని బోరంచ ఎస్‌ఏపీ సెగ్మెంట్ ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుండగా భారీ వర్షాల కారణంగా మంజీరా నదిలో రావాటర్ టర్బిడిటీ ఎక్కువగా ఉండి, కొత్తనీరు బురదమయంగా ఉన్నది. ఆయా సమస్యలను పరిష్కరించి స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ వాసులు గమనించి సహకరించాలని కోరారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

జిన్నారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలంలో ఎంపీ రఘునందన్ రావు సహకారంతో సోలార్ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశామని బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దాదిగూడెంలో ఏర్పాటు చేసి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు నర్సింగ్‌రావు, సుధాకర్, అశోక్, కృష్ణ, దేవేందర్, ఆంజనేయులు, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

19న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల సమావేశం

జిన్నారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విస్తృత స్థాయి సమావేశం 19 నిర్వహించనున్నట్లు సంఘ్ మండల నాయకులు ఆనంద్ తెలిపారు. జిన్నారంలో 19న బొంతపల్లి ఖండ ఆధ్వర్యంలో జిన్నారం, సోలక్‌పల్లి, బొల్లారం ఉప మండలాల ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల సమావేశం వివేకానంద హైస్కూల్ ప్రాంగణంలో సాయంత్రం 5:30 గంటలకు నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో సంఘ్ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సిమెంట్ బస్తాల వితరణ

నారాయణఖేడ్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెంకటాపూర్ తండాలో ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారుల్లో నలుగురు అతిపేదలు గృహాల నిర్మాణాలను ప్రారంభించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన అదే తండాకు చెందిన కర్ర రాములుచౌహాన్ సొంత ఖర్చుతో ఒక్కొక్కరికి 20 చొప్పున సిమెంట్ బస్తాలను కొనుగోలు చేసి అందజేశారు. బస్తాలను ట్రాక్టర్‌లో వేయించి ఆదివారం తండాకు పంపి లబ్ధిదారులకు అందజేశారు.

ఆర్యవైశ్య యూత్ కమిటీ ఎన్నిక

పెద్దశంకరంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలో ఆర్యవైశ్య సంఘం భవనంలో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం యూత్ కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా కైల సంగమేశ్వర్, కోశాధికారిగా బొడ్ల ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా దాదిగారి సురేష్, పబ్బ మాణి కిరణ్, కార్యదర్శులుగా కందుకూరి శ్రీకాంత్, ప్రమోద్, సహాయ కోశాధికారులుగా బిల్లకంటి వంశీ, కందుకూరి అయ్యప్ప, పీఆర్వోలుగా దాదిగారి వినీత్, పురం కిషోర్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గోమాతకు అంత్యక్రియలు

నారాయణఖేడ్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ ఆలయానికి భక్తులు వదిలిన గోమాత ఆకస్మికంగా మృతిచెందడంతో గ్రామస్థులు అంత్యక్రియలు నిర్వహించారు. మండల పరిధిలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో ఆదివారం హనుమాన్ ఆలయానికి సంబంధించిన గోమాత ఆకస్మికంగా మృతిచెందింది. దీంతో గ్రామస్థులంతా కలిసి శాస్త్రోక్తంగా పూజలు చేసి, భజనలు, కీర్తనలతో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

వట్‌పల్లి ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

వట్‌పల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జగన్‌గౌడ్, గౌరవాధ్యక్షులుగా దాసయ్య, సతీష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా బాగయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కార్యదర్శిగా నరసింహారెడ్డి, కోశాధికారిగా షఫీ, సలహాదారునిగా మల్లేశం, సభ్యులుగా శ్రీశైలం, మోష, విజయ్, శ్రీపాదచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో సన్మానించారు.

సమస్య మళ్లీ మొదటికి..!

- పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్
- ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాలు
- పొంచి ఉన్న ప్రమాదం
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు



నర్సాపూర్‌లో ప్రధాన చౌరస్తాలో సిగ్నల్స్ పనిచేయక అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

నర్సాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అది రెండు ప్రధాన రహదారులు కలిసే నర్సాపూర్ ప్రధాన చౌరస్తా.. అంతటి ప్రధానమైన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారి, సంగారెడ్డి-తూప్రాన్ ప్రధాన రహదారులు నర్సాపూర్‌లో కలిసే చౌరస్తా వద్ద రోజు వాహనాల రద్దీ ఉంటుంది. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ విషయంలో అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేసినప్పటి నుంచి సమస్య తలెత్తుతుంది. తరచూ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో చౌరస్తా వద్ద వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగే ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్యనే అధికారులు సిగ్నల్స్‌ను బాగు చేయించినా సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో పనిచేసి తాత్కాలిక మరమ్మతులు కాకుండా.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

సీఎం సహాయనిధితో ప్రయోజనం : ఎమ్మెల్యే

జహీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి నిరుపేదలకు ఉపయోగకరంగా మారిందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ.3.51 లక్షలు విలువచేసే చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రజారోగ్యాల దృష్ట్యా ప్రభుత్వం అందజేసే సీఎం సహాయనిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా

నర్సాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసానిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.87 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, నాయకులు సత్యంగౌడ్, నర్సింలు, హుస్సేన్ పాల్గొన్నారు.

ఆపత్కాలంలో ఆపన్నహస్తం



ఆదర్శనగర్ గెస్ట్‌హౌజ్‌లో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి, తదితరులు

జహీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆపత్కాలంలో ఆపన్నహస్తంగా నిలుస్తున్నదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆదర్శనగర్‌లోని ఆయన గెస్ట్ హౌజ్‌లో వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్‌సుభాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత హామీలే

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



ఘనపూర్ ఆనకట్ట వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి చిన్న ఘనపూర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం ఘనపూర్ ఆనకట్టను సందర్శించి, గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత ఉండడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో యూరియా కొరత లేకుండా అందించిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల దుకాణాల వద్ద రైతులు చెప్పులు వరుసగా పెడుతున్న పరిస్థితి దాపురించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, యాదగౌడ్, సంతోష్, నరేందర్‌రెడ్డి, బాగారెడ్డి, రాజాగౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

- డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్



జహీబాద్ నుంచి బడంపేటకు పాదయాత్రగా వెళ్లిన వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు, కార్యకర్తలు

జహీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాచన్నస్వామి ఆలయం నుంచి కోహీర్ మండలం బడంపేటలోని రాచన్నస్వామి ఆలయం వరకు సమాజ్ నాయకులు, భక్తులు అభిమానులు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ప్రతియేటా శ్రావణమాసం సమయంలో పాదయాత్రగా వెళ్లడం సంతోషకరమన్నారు. ఈ ఏడాదితో మూడోసారి వెళ్లడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరం పాల్గొంటే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సమాజ్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- మండపాల నిర్వాహకులు వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసు వారి సలహాలు, సూచనలు పాటించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో సూచించారు. పోలీస్‌శాఖ రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండపం నిర్వహణ, సమాచారం కోసం ప్రత్యేక పోర్టల్ రూపొందించామన్నారు. భద్రత, బందోబస్తు ఏర్పాటుకు పోలీసులకు సులువుగా ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు పూర్తి చేసిన తర్వాత దరఖాస్తుదారుడు అప్లికేషన్ ఫారంతోపాటు కంప్యూటర్ అక్నాలెడ్జ్‌మెంట్‌ను సంబంధిత స్టేషన్‌లో అందజేయాలన్నారు. ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం పూర్తయ్యేంత వరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఏ సమస్య ఉన్నా.. పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అమీన్‌పూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గుంతలమయంగా మారిన అమీన్‌పూర్-లింగంపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కార్మికులు సుమారు 50 కాలనీలలో స్థిర నివాసం ఏర్పరచుకుని ఇక్కడి నుంచి నిత్యం విధులు నిర్వర్తించేందుకు వెళ్తుంటారన్నారు. పెద్దఎత్తున కురుస్తున్న వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణం చేయలేక నిత్యం నరకం చవిచూస్తున్నారని సీపీఎం నాయకులు వాపోయారు. బందంకొమ్ము వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గతంలో అనేకమార్లు పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మున్సిపల్ అధికారులకు రోడ్డు దుస్థితిపై వినతిపత్రాలు సమర్పించినా కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఎంతో ముఖ్యమైన ప్రధాన రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం జిల్లా నాయకులు రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

- 24న జోగిపేటలో సన్నాహక సమావేశం
- హాజరుకానున్న మందకృష్ణమాదిగ

అల్లాదుర్గం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య, మాజీ జడ్పీటీసీ అర్జునయ్య డిమాండ్ చేశారు. ఆదివారం అల్లాదుర్గంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. అధికారంలోకి రాగానే వితంతువులకు, వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్లు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. సెప్టెంబరు 9న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో బహిరంగ సభను నిర్వహించ తలపెట్టారని, అందులో భాగంగా ఈ నెల 24న అందోల్ నియోజకవర్గంలోని జోగిపేటలో నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథులుగా మందకృష్ణ మాదిగ హజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క సూర్యకుమార్, జలగల రవి, ఏర్పుల కృష్ణ, ఎర్రోళ్ల సంజీవయ్య, రాములు, లింగయ్యప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సరైన భోజనం అందించాలి

- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

మనోహరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సరైన భోజనం అందించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కూచారం కస్తూర్బాగాంధీ బాల, బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యపట్ల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని వంట గదిని, పాఠశాల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ దీక్షిత్, ఉపాధ్యాయులు గౌతమి తదితరులు ఉన్నారు.

దూప్‌సింగ్ తండా బ్రిడ్జి పనులు చేపట్టాలి

హవేళిఘణపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దూప్‌సింగ్‌తండా రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి గిరిజనుల బాధలు తీర్చాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని దూప్‌సింగ్‌తండా బ్రిడ్జిని బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ తండా ప్రజల బాధలు ఎవరూ తీర్చడం లేదన్నారు. ప్రతి సంవత్సరం భారీ వర్షాలు పడినప్పుడు రోడ్డు మధ్యలో ఉన్న శిథిలమైన బ్రిడ్జి పైనుంచి నీళ్లు వెళ్లడంతో తండావాసుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మించేందుకు పనులు ప్రారంభించినా మధ్యలోనే ఆగిపోయాయి. అధికారులు పనులు పూర్తి చేయించి గిరిజనుల బాధలు తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు శ్రీపాల్, ఎంఎల్ఎన్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు శ్యాంసుందర్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

డెంగ్యూ బాధితురాలికి ప్లేట్‌లెట్స్ దానం

నారాయణఖేడ్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ప్రాంతానికి చెందిన బేబీ ఆశ్రాకు డెంగ్యూ జ్వరం సోకడంతో కుటుంబీకులు హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు అత్యవసరంగా ఓ నెగిటివ్ ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సిన అవసరం ఉందని నిర్ధారించారు. ఆ గ్రూపునకు సంబంధించిన ప్లేట్ లెట్స్ అందుబాటులో లేకపోవడంతో బాధితురాలి కుటుంబీకులు ఖేడ్ రక్తదాతల సమూహ సహకారాన్ని కోరారు. అదే గ్రూపు రక్తం గల రక్తదాతల సమూహ సభ్యులు, సామాజిక సేవ కార్యకర్త ఓం ప్రకాష్ స్పందించి ఆదివారం వైద్యశాలకు వెళ్లి తన ప్లేట్‌లెట్స్‌ను దానం చేశారు. ఆయన రక్తదానం చేయడం ఇది 49వ సారి కావడం గమనార్హం.

ముళ్లపొదలు, చెత్త తొలగింపు



ఖేడ్‌లో ఎక్స్‌కవేటర్‌తో వాగులోంచి తొలగిస్తున్న ముళ్ల కంచెలు

నారాయణఖేడ్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : మనూరు, ఖేడ్ మండలాల్లోని పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి వరదనీరు ఖేడ్ పట్టణం పక్కనున్న వాగు ద్వారా దిగువకు ప్రవహిస్తుంది. ఈ వాగుపై లోలెవల్ కాజ్‌వే ఉన్నది. వారంరోజులుగా పలుమార్లు కరిసిని వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాగు పక్కన చేలకు వేసిన ముళ్లకంచెలు, విరిగి పడిన చెట్లు, వ్యర్థాలు కొట్టుకొచ్చి లో లెవల్ కాజ్‌వేకు తట్టుకున్నారు. నీటి ప్రవాహానికి అడ్డుగా మారడంతో వాగు పక్కన ఉన్న గృహాల్లోకి నీరు చేరుతుంది. ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ముళ్ల కంపలు, వ్యర్థాలు తొలగించారు.

బీసీ సంఘం నిరాహార దీక్షకు తరలిరండి

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుగౌడ్

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈనెల 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేపట్టే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ కోరారు. సంగారెడ్డిలోని సంఘ భవనంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలు అధిక సంఖ్యలో దీక్షకు తరలిరావాలని కోరారు. బీసీ రిజర్వేషన్లలో కొందరికి సందేహాలు ఉన్నాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరస్వామి, ముఖ్య సలహాదారులు చంద్రయ్యస్వామి, కార్యదర్శి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమంగా ఫిల్టర్ ఇసుక రవాణా

పటాన్‌చెరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఫిల్టర్ ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ వివరాల ప్రకారం.. కంది మండలం బ్యాతోల్ గ్రామంలో అక్రమంగా తవ్వుతున్న ఫిల్టర్ ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక ధరలకు అమ్మడానికి టిప్పర్‌లో రవాణా చేస్తుండగా పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామం జాతీయ రహదారిపై పట్టుకున్నారు. డ్రైవర్ వినోద్‌యాదవ్, టిప్పర్ యజమాని మోహన్‌పై కానిస్టేబుల్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చేపల చెరువుపై మంత్రికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

- మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజ్

వట్‌పల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఖాదరాబాద్, ఉసిరికపల్లి, నిర్జప్ల గ్రామాల్లో అక్రమంగా చేపల చెరువులు ఏర్పాటుచేసి కొందరు సొమ్ము చేసుకుంటున్నారని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజ్ అన్నారు. దీనిపై రేపు మాల మహానాడు జిల్లా సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల అండదండలతో చేపల చెరువులు ఏర్పాటు చేశారని పలుసార్లు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

కొనసాగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు



పటాన్‌చెరు వేణుగోపాలస్వామి ఆలయంలో రెండోరోజు ఉట్టికొడుతున్న భక్తులు

పటాన్‌చెరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు వేణుగోపాలస్వామి ఆలయంలో రెండోరోజు శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారికి జలాభిషేకాలు జరిపారు. సాయంత్రం సమయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఉట్టికొట్టడానికి ఆసక్తి చూపారు. కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖులను సత్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ క్రీడాకారులతో రూరల్ సీఐ, ఎస్ఐ

సిద్దిపేట రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు నిర్మూలనపై గ్రామీణ యువతకు అవగాహన కల్పించడంలో భాగంగా క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చాలా మంది యువకులు సరైన ప్రోత్సాహం లేక చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటివి వాడినట్లైయితే వారిని గుర్తించి మంచి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజలకు మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడేందుకే పోలీసుశాఖ తరఫున క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

కొండపాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని దుద్దెడలో ఆదివారం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, డ్రంకెన్ డ్రైవ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.